www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 జనవరి 2025

కిరాణా షాపులో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామంలో బుధవారం ఓ కిరాణాషాపులో సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేశారు. కాలం చెల్లిన సరుకుల్ని విక్రయిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై సివిల్ సప్లై డీటీ అయితం సత్యనారాయణ ఆకస్మికంగా దాడి చేసి స్టాక్ తనిఖీ చేశారు. షాపు యాజమానిని విచారించి ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అధికారులకు విషయాన్ని తెలియజేశారు. గతంలో కూడా ఈషాపు యాజమానిపై కేసు నమోదైనందున అధికారులకు విషయాన్ని తెలియజేశారు. ఆయన వెంట విఆర్‌ఒ కె.చిన్న ఉన్నారు.

తనిఖీ చేస్తున్న అధికారులు

మోగిన గ్రాడ్యుయేట్..
ఎన్నికల గంట

ఉమ్మడి గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదల
ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లాకలెక్టర్‌కు అప్పగింత
ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్, పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
27వ తేదీన పోలింగ్, మార్చి మూడో తేదీన ఎన్నికల కౌంటింగ్
ఆరు విభజిత జిల్లాల్లో 440 పోలింగ్ కేంద్రాలు, 3,15,261 మంది ఓటర్లు
అమల్లోకి ఎన్నికల కోడ్, నామినేషన్ తేదీ వరకూ ఓటు నమోదుకు అవకాశం
ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమ ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల గంట మోగింది. బుధవారం అందుకు సంబంధించిన షెడ్యూల్ కేంద్ర ఎన్నికల కమీషన్ విడుదల చేసింది. దీంతో ఒక్కసారిగా ఎన్నికల కోలాహలం ఊపందుకుంది. రిటర్నింగ్ అధికారి హోదాలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్‌ను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి విలేకరుల సమావేశంలో వివరించారు. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. 13వ తేదీతో విత్‌డ్రాల పర్వం ముగియనుంది. 27వ తేదీన ఎన్నికల పోలింగ్, మార్చి మూడో తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో విభజించిన ఏలూరు, పశ్చిమ, అల్లూరి సీతారామరాజు, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండగా, ఇందులో పురుష ఓటర్లు 1,83,734 మంది, మహిళా ఓటర్లు 1,31,507 మంది, థర్డ్ జండర్ ఓటర్లు 20 మంది ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారమే రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల తేదీ వరకూ కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అమల్లోకి ఎన్నికల కోడ్..

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. దీంతో ఇప్పటికే ప్రకటించిన గృహప్రవేశాలు వంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిలిచిపోనున్నాయి. పశ్చిగోదావరి జిల్లా పెనుగొండలో జరగనున్న సిఎం పర్యటన జరుగుతుందో లేదో తేలాల్సి ఉంది. సాధారణ ఎన్నికలకు వర్తించే అన్ని నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పనులేవీ చేపట్టడానికి వీలుండదు. ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆంక్షలు ఏర్పడనున్నాయి.

రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లాకలెక్టర్

ఉభయగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరించేవారు. ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియ అంతా కాకినాడ కలెక్టర్ ఆధ్వర్యంలోనే జరిగేది. ఈ సారి గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్‌ను నియమించారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ అంతా ఏలూరు కేంద్రంగా జరగనుంది. ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ, కౌంటింగ్ ఏర్పాట్లు, మీడియా సెంటర్‌తో పాటు అన్నీ ఏలూరులోనే ఏర్పాటు కానున్నాయి.

టిడిపి, పిడిఎఫ్ మధ్య పోటీ..

ఉభయగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి టిడిపి, పిడిఎఫ్ మధ్య పోటీ ఉండనున్నట్లు చెప్పొచ్చు. ఇప్పటికే టిడిపి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం ఆ పార్టీ ప్రకటించింది. ఉపాధ్యాయ నేతగా రాష్ట్రస్థాయిలో పనిచేసిన డివి.రాఘవులును అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా మరికొంత మంది నామినేషన్ వేసే అవకాశం ఉంది. వైసిపి తమ అభ్యర్థిని బరిలో దింపుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది. షెడ్యూల్ విడుదల కావడంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కోలాహలం ఊపందుకుంది.

ఆరు జిల్లాల ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జండర్	మొత్తం
ఏలూరు	62	24,895	17,699	8	42,602
పశ్చిమ	93	39,780	30,103	1	69,884
అల్లూరి సీతారామరాజు	12	2,839	1,825	0	4,664
కాకినాడ	96	42,437	27,899	7	70,343
బిఆర్ అంబేద్కర్ కోనసీమ	95	37,069	27,256	2	64,327
తూర్పుగోదావరి	82	36,714	26,725	2	63,441
మొత్తం	440	1,83,734	1,31,507	20	3,15,261

ఎన్నికల షెడ్యూల్..
నోటిఫికేషన్ : 3.02.2025
నామినేషన్ ఆఖరుతేదీ : 10.02.2025
నామినేషన్ పరిశీలన :11.02.2025
విత్‌డ్రా ఆఖరు తేదీ : 13.02.2025
ఎన్నికల పోలింగ్ : 27.02.2025
సమయం : ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు
కౌంటింగ్ :3.03.2025
ఎన్నికల ప్రక్రియ పూర్తి :8.03.2025

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - పెనుగొండ

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక నగరేశ్వర, మహిషాసురమర్ధిని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించనున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా తొలుత హెలీపాడ్ ప్రాంతాన్ని బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి సెక్యూరిటీ పర్యవేక్షకులు, అడిషనల్ ఎస్‌పి రమణ, తదితరులు పరిశీలించారు. పెనుగొండ వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద జరుగుతున్న హెలీపాడ్ కాంక్రీట్ పనులను పరిశీలించి ఆర్‌అండ్‌బి అధికారులకు తగు సూచనలు చేశారు. అదే ప్రాంగణంలో ప్రముఖులు, పెద్దలు, ముఖ్యమంత్రిని కలిసేందుకు ఏర్పాటు చేస్తున్న ఎల్-వన్, ఎల్-టు ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డు ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డిపిఒను ఆదేశించారు. అనంతరం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించుకున్నారు. అలాగే ఆలయానికి ఆనుకుని ఉన్న నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో 31న హోమం నిర్వహించే ప్రాంతాన్ని సెక్యూరిటీ అధికారులతో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయంలోని గోశాలను పరిశుభ్రంగా ఉంచి ముగ్గులతో అలంకరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా దేవాదాయ శాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం వాసవీ శాంతి ధామ్ ఋషి గోత్ర సువర్ణ మందిరాన్ని సందర్శించి ఆలయ ట్రస్టీ పిఎన్ గోవిందరాజులుతో శాంతి ధామ్‌లో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. సిఎం పర్యటనలో ఏ విధమైన లోటుపాట్లకు తావు లేకుండా అన్ని ఏర్పాట్లూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు, జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, ఆర్‌డిఒలు దాసి రాజు, ఖతీబ్ కౌసర్ భానో, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఇవి.సుబ్బారావు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఎల్‌సి గోపీమూర్తి
మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి స్థానిక ఎవిఎస్‌ఎన్ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు కూడా తనిఖీల్లో భాగంగా పాఠశాలకు వచ్చి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గోపీమూర్తి మధ్యాహ్న భోజన అమలు తీరు గురించి కృష్ణారావును అడిగి తెలుసుకోవడమే కాకుండా విద్యార్థులు వంట ఏజెన్సీల సమస్యలను అడిగి విద్యాశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం కృష్ణారావు మధ్యాహ్న భోజన రికార్డులను గుడ్లు, చిక్కీలు, బియ్యం, నిల్వలను పరిశీలించారు. టాయిలెట్ల నిర్వహణ బాగుందని కొనియాడారు. వంట గది, టాయిలెట్లను పరిశీలించారు. 327 మంది విద్యార్థుల్లో 303 మంది హాజరవ్వగా 260 మంది మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో భోజనం చేయని 43 మందికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇక నుంచి పాఠశాలలోనే భోజనం చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కొద్ది రోజుల్లో మెనూ మారనుందని, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఆర్.దీపిక, సిఆర్‌పి కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని ప్రకటించాలి

సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలి
లేనిపక్షంలో పోరాటం కొనసాగిస్తాం
భీమవరం స్టీల్ ప్లాంట్ పరిరక్షణ యాత్రలో రామస్వామి

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని ప్రకటించడంతోపాటు సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలని, లేని పక్షంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్టీల్ ప్లాంట్ పరిరక్షణ రాష్ట్ర నాయకులు యు.రామస్వామి అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి మంగళవారం ప్రారంభమైన విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ యాత్ర పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ దగ్గర బుధవారం జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ నుంచి మార్టేరు పాలకొల్లు, వీరవాసరం విస్సాకోడేరు చేరి అక్కడ నుంచి భీమవరం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి యాత్రకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రమైన భీమవరం వరకూ సాగింది. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో ఏర్పాటు చేసిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు రామస్వామి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉక్కు, భారీ పరిశ్రమల కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ఇలాకాలో సభ నిర్వహించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించడం అభినందనీయమని కానీ దీనివల్ల ఒరిగిందేమీ లేదన్నారు. మూడేళ్ల నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్నా జీతాలు ఇవ్వకపోవడమే కాకుండా కనీసం ఫ్యాక్టరీని కూడా నడిపించలేదన్నారు. ఈ నష్టానికి కేంద్రమే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్మికులకు సుమారు రూ.240 కోట్ల వేతన బకాయిలు ఉన్నాయన్నారు. అయితే ప్రకటించిన ప్యాకేజీ మాత్రం ఫ్యాక్టరీ నడిపేందుకు గాని జీతాలు చెల్లించేందుకు గాని కాదని కేవలం అప్పులు తీర్చేందుకు మాత్రమే అని చెప్పడం దారుణమన్నారు. సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.లక్షా 50 వేల కోట్లు కేటాయించాలన్నారు. రూపాయి ఖర్చు లేకుండా సెయిల్‌లో విలీనం చేస్తే 200 మిలియన్ల టన్నుల స్టీల్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. దీనివల్ల 30 వేల నుంచి 40 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. విలీనానికి సెయిల్ బోర్డు ఒప్పుకోవట్లేదని చెబుతున్నా ప్రభుత్వ పెద్దలు ఆంధ్ర బ్యాంక్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఏ విధంగా విలీనం చేశారని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే ఆ వర్గాలకు ద్రోహం చేసినట్లేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బిజెపిపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. అనంతరం డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడారు. ఈ సభలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ యాత్ర దళ సభ్యులు మహేష్, శ్రీనివాస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్‌రాయ్, ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, సిపిఎం జిల్లా నాయకులు, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భీమవరం సభలో మాట్లాడుతున్న రామస్వామి

ఆచంట: స్టీల్ ప్లాంట్ లాభాలు బాట పట్టాలంటే ఉక్కు ఫ్యాక్టరీని అమ్మే నిర్ణయాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి నాయకులు యు.రామస్వామి, బి.మహేష్ అన్నారు. బుధవారం సాయంత్రం విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ జాతా పెనుగొండ మండలం సిద్ధాంతం చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్‌తోపాటు ఆచంట, పెనుగొండ, పోడూరు, పెనుమంట్ర సిపిఎం నాయకులు ఈ జాతాకు స్వాగతం పలికారు. అనంతరం సిద్ధాంతం, వడలి, పెనుగొండ మీదుగా మార్టేరు సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా విశాఖ ఉక్కు పరిరక్షణ సమితికి పూలతో మహిళలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రామస్వామి, మహేష్ మాట్లాడుతూ ఉక్కు సంకల్పంతో విశాఖ ఉక్కు కార్మికులు, రాష్ట్ర ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు వివిధ రూపాయల్లో చేస్తున్న పోరాట ఫలితమేమన్నారు. కేంద్ర ప్యాకేజీతోనే విశాఖ ఉక్కు భవిష్యత్తు మారిపోయినట్లు, సమస్య పరిష్కారం అయిపోయినట్లు, ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, టిడిపి, జనసేన, బిజెపి కూటమినేత్తలు ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. కేవలం ఈ ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం అన్న అంశాన్ని మరుగునపర్చాలని చూస్తున్నారన్నారు. కార్మికులకు అండగా నిలబడాల్సిన బిజెపి ప్రజా ప్రతినిధులు కార్మికులను దోషులుగా నిలిపి, కార్పొరేట్లకు అండగా నిలుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి సభ్యులు జి.శ్రీనివాసు, బి.గురప్ప, వై.రాము, జిల్లా నాయకులు సూర్నీడి వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి పి.మోహనరావు, కాకర వెంకటేశ్వరరావు, పిల్లి ప్రసాద్, సుబ్బరాజు, శర్మ రంగారావు, జయరాజు, నరసింహమూర్తి, బత్తుల విజయకుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనమే అని స్టీల్ ప్లాంట్ రక్షణ సమితి నేతలు రామస్వామి, గురప్ప, మహేష్ తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ జాతా జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం పాలకొల్లు విచ్చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు పూర్తి రక్షణ కావాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే సెయిల్‌లో విలీనం చేసి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్రాన్ని ఒప్పించి ప్రకటన చేయాలని కోరారు. ఈ జాతా సిపిఎం రాష్ట్ర మహాసభకు హాజరు కానుందని తెలిపారు. తమ డిమాండ్లు సాధించే వరకూ పోరాటం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరిన జాతాకు సిపిఎం నేతలు, ప్రజలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, తానేటి బాలరాజు, జవ్వాది శ్రీనివాస్, బాతిరెడ్డి జార్జి, ముచ్చర్ల త్రిమూర్తులు, యర్రా అజయ్ కుమార్, గూడూరి నాగేశ్వరరావు, పురుషోత్తం, నీలకంఠం, పుగాకు పూర్ణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం పాల్గొన్నారు.

పాలకొల్లులో..

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్షలకు హాజరుకానున్న 37,903 మంది విద్యార్థులు
52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు సమీక్షించి మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలలో భాగంగా ఫిబ్రవరి 1వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యుయేషన్ ఎడ్యుకేషనల్ పరీక్ష, 3న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష, 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ ఎగ్జామ్స్, జనరల్ ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రధాన పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది 19,775 మంది విద్యార్థులు, రెండవ ఏడాది 18,128 మంది విద్యార్థులు మొత్తం 37,903 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలలో విద్యుత్ సదుపాయం, పరీక్ష రాయడానికి వీలుగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల భద్రతకు పూర్తి పోలీసు బందోబస్తుతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు సూపర్వైజర్లు, ఇన్విజిలేటర్లు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 114 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష నిర్వహణ తేదీలలో నిర్దేశించిన సమయాలకు ఆర్‌టిసి బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు శానిటేషన్, తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలోను సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా ఉండాలని అన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఇఇఒ ఎ.నాగేశ్వరరావు, జిల్లా స్పెషల్ ఆఫీసర్ వీకే మల్లేశ్వరరావు, డిఇసిలు కెవి.రామారావు, బి.అప్పారావు, ఎంవిఆర్ దేవరాజ్, పోస్టల్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఎ.సురేష్ కుమార్, సిఐ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో కలెక్టరేట్ ఏర్పాటును కొనసాగించాలి

కలెక్టరేట్ తరలింపు ప్రచారంపై జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ స్పష్టత ఇవ్వాలి
వేరే ప్రాంతానికి తరలించాలని చూస్తే ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తాం
ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తాం
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాల పునర్విభజన తర్వాత భీమవరాన్ని జిల్లా కేంద్రంగా నిర్ణయించి కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుత కలెక్టరేట్ ప్రజలకు అసౌకర్యంగా ఉన్నప్పటికీ పరిపాలనంతా సజావుగా సాగుతోందని, అయితే కలెక్టరేట్‌ను వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, దీనిపై జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ స్పష్టత ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, బి.వాసుదేవరావుతో కలిసి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఓ ప్రయివేటు భవనంలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నారన్నారు. ఇది కూడా దూరంగా ఉండడంతో ప్రజల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇది తాత్కాలికంగానే ఉంటుందని కలెక్టరేట్ సొంతభవనాలు ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం గతంలోనే చెప్పిందని గుర్తు చేశారు. దీనిలో భాగంగా బైపాస్ రోడ్డులో ఉన్న మార్కెట్ యార్డులో 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం జిఒ కూడా జారీ చేసిందన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ప్రజానీకానికి ఈ మార్కెట్ యార్డు స్థలం అందుబాటులో ఉంటుందన్నారు. అయితే ఈ మార్కెట్ యార్డు స్థలాన్ని మార్పు చేస్తున్నట్లు జిల్లాలో చర్చ జరుగుతోందన్నారు. ఇది వాస్తవమా అవాస్తవమో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారన్నారు. మార్కెట్ యార్డు స్థలం, జారీ చేసిన జిఒను రద్దు చేశారని వస్తున్న ప్రచారంపై జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ స్పందించి స్పష్టత ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ ఏర్పడి మూడేళ్లు గడుస్తోందని, అంతా ప్రశాంతంగా ఉన్న సమయంలో కలెక్టరేట్ మార్పు అంశం తెరపైకి రావడంతో గందరగోళానికి గురవ్వడమే కాకుండా విభేదాలు ఏర్పడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సిపిఎం విభేదాలకు తావు ఇవ్వదని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన జిఒ ఆధారంగా కలెక్టరేట్ ఏర్పాటును కొనసాగించాలన్నారు. కలెక్టరేట్ మార్పుపై జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ తక్షణం స్పందించాలన్నారు. కలెక్టరేట్ మార్పు నిజమైతే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కార్యాచరణకు దిగుతామని చెప్పారు. అందర్నీ కూడగట్టి సభలు, సమావేశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రాజు కాలవను ప్రక్షాళన చేయాలి

కుమదవల్ల గ్రామస్తులు డిమాండ్

ప్రజాశక్తి - పాలకోడేరు

కలుషిత నీటిని చూపిస్తున్న గ్రామస్తులు

రాజు కాలవ గట్టు వెంబడి అక్రమంగా నిర్మించిన గృహాల వల్ల రాజు కాలవ పూర్తిగా కలుషితమైందని, ఈ నేపథ్యంలో రాజు కాలవను ప్రక్షాళన చేయాలని కుముదవల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక గ్రామంలో తాగునీటి చెరువు వద్ద రాజు కాలవను ప్రక్షాళన చేయాలని, అక్రమ ఇళ్లను తొలగించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భూపతి రాజు శ్రీకృష్ణ వర్మ మాట్లాడుతూ రాజు కాలవ గట్టు వెంబడి ఉన్న గృహాల వల్ల రాజు కాలువ కలుషితం బారిన పడిందన్నారు. రాజు కాలవ నుంచి కలుషితనీరు కుముదవల్లి వచ్చి చేరడం వల్ల తాగు, సాగునీరు కలుషితమవుతుందన్నారు. దీనివల్ల గ్రామస్తులు అనేకమంది అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణ నష్టం జరగకుండా సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ స్పందించి రాజుకాలవ ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగి మధుసూదన్ రాజు, బుద్ధరాజు బలరామరాజు, కలిదిండి సుబ్రహ్మణ్యం రాజు, భూపతి రాజు నాగేంద్ర వర్మ, సాగి సుబ్బరాజు, పి.శ్రీనివాసరావు, భూపతిరాజు పాండురంగరాజు, భూపతి రాజు రంగరాజు, సిహెచ్.నారాయణ రావు, మల్లుల వెంకన్న బాబు, నక్క అప్పలరావు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యం

ఎంపిడిఒ బేబిశ్రీలక్ష్మి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల సుస్థిరాభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషిచేయాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రజాప్రతినిధులకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలుగజేయడంతో పాటు స్వయం సంవృద్ధికి పాటు పడాలని అన్నారు. గ్రామాల్లో బాలసభలు, మహిళా సభలు, గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి గ్రామాలభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి పి.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కె.రూపేష్, పిఆర్ ఎఇ కె.దుర్గాప్రసాద్, డి.రామాంజనేయులు, ఎ.భాస్కర్, మండలపరిషత్ ఎఒ శ్రీరంగనాయకులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే ప్రగతి సాధించాలి : ఎపిఎం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల పరిషత్, గ్రామ పంచాయతీల స్థాయిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకొని, ఆ ప్రకారం ప్రగతి సాధించాలని ఎపిఎం పద్మ కోరారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ భవనంలో జరిగిన అభివృద్ధి ప్రణాళిక ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్ని ప్రభుత్వ రంగాల్లో మండలం, గ్రామాల్లోని అన్ని ప్రాంతాల్లో ఆశించిన అభివృద్ధి కోసం కార్యాచరణ చేయాలని, సామర్ధ్యాలు పెంచుకోవాలని ఎంపిడిఒ పి.శామ్యూల్ అన్నారు. ఈ శిక్షణలో ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు), పలువురు ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు, వ్యవసాయ శాఖ, ఐసిడిఎస్, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

ఎంపిడిఒ విశ్వనాథ శర్మ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సమగ్ర ప్రణాళిక అవసరమని తాడేపల్లిగూడెం ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ శర్మ సూచించారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం జిపిడిపి(గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్) అంశంపై సర్పంచులు, ఎంపిటిసిలకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టవలసిన పనులు, ప్రాధాన్యం, తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రాజా శ్రీనివాస్, చిట్టి మువ్వల శెట్టి శ్రీనివాస్ కుమార్, ఎంపిపి పి.శేషులత, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ అందజేత

మొగల్తూరు : దాతలు అందజేస్తున్న సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్ అన్నారు. మండలంలో పాతపాడు, కాళీపట్నం, పేరుపాలెం, నీటితిప్ప గ్రామాల్లో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలలోని తెలుగు మీడియం విద్యార్థులకు నరసాపురానికి చెందిన జీవాజీ గోల్డ్ వారి ఆర్థిక సహాయంతో ఎపి యుటిఎఫ్ ముద్రించిన పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని పదవ తరగతిలో అత్యధిక శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి కొల్లాటి బ్రహ్మయ్య, మండల కార్యదర్శులు దొంగ చింతయ్య, ఏలూరి శ్యాంబాబు ఉన్నారు.

జాతీయ స్థాయిలో శశి విద్యార్థుల సత్తా

తాడేపల్లిగూడెం : శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కె.అమరవాణి, ఎన్.హితేష్ జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇస్మాయిల్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. అస్సాం అగ్రికల్చరల్ యూనివర్శిటీలో నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్నారన్నారు. ఈ శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి సంస్కృతి, సమైక్యత, నాయకత్వ నైపుణ్యాలు, దేశభక్తి అంశాలపై విస్తృతంగా చర్చలు, ప్రాక్టికల్ సెషన్లు, సామూహిక కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ షేక్ సల్మాన్ బాషా అభినందనలు తెలియజేశారు.

మున్సిపల్ పాఠశాల తనిఖీ

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక జిల్లా కోఆర్డినేటర్ గుంటపల్లి చిన్నయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఎండిఎం రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం స్వీకరించే హాజరు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గుడ్ల పరిమాణం పరిశీలించారు. టాయిలెట్లు, బాత్రూంలు, స్కూల్ కిచెన్ గార్డెన్, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను చూసి సంతృప్తి చెందారు. దాతల ద్వారా పాఠశాలను అభివృద్ధిని చేస్తున్న హెచ్ఎం భవానీ ప్రసాద్ రాయపూడి ఉపాధ్యాయులకి ఆదర్శమన్నారు. ఈ పాఠశాలలో అభ్యుదయ పాఠశాలకు కావలసిన వనరులు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి లింగేశ్వర్, రామకృష్ణ, పేరెంట్స్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

నరసాపురం : మండలంలోని సీతారాంపురం నార్త్, పసలదీవి, చామకూరిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈదా అనిల్ కుమారి, మండల వ్యవసాయ అధికారి శామ్యూల్ జాన్సన్, ఎఇఒ లక్ష్మి నారాయణ గ్రామాల్లో సొసైటీ నందు గల ఎరువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ అనిల్ కుమారి మాట్లాడుతూ ఎవరైనా రైతులు, మధ్య దళారులు, డీలర్లు కృత్రిమ కొరత సష్టించినచో వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎరువుల యాజమాన్యంపై సూచనలు, సలహాలు అందించారు. రైతులు కాంప్లెక్స్ ఎరువులు రెండు, మూడు కోటాలలో వేస్తున్నారు అలా వేయకూడదని, మొదటి కోటాలోనే కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవాలని సూచించారు.

ఉండి : ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ చేసే వ్యవసాయంలో అధిక లాభాన్ని పొందవచ్చని ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చెరుకువాడ గ్రామంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రైతు ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. దాళ్వా పంటకు సంబంధించి నీటి వంతుల విధానం గురించి, ఇ-పంట నమోదు, ఇకెవైసి, ఫార్మర్ ఎన్రోల్మెంట్ వంటి వాటి గురించి రైతులకు వివరించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి సంధ్య మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామ పెద్దలు, వ్యవసాయ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా సాగింది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 11 ఏళ్ల క్రితం మున్సిపాలిటీ వేములదీవి గ్రామంలో కొనుగోలు చేసిన డంపింగ్ యార్డ్ స్థలాన్ని గత ప్రభుత్వం పురపాలక సంఘానికి తెలియజేయకుండా ఇళ్ల పట్టాలు ఇవ్వడంపై ప్రతిపక్ష సభ్యులు మండి పడ్డారు. అసలు ఈ స్థలం మున్సిపల్ రికార్డులో ఉందా? లేదా ? అంటూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. చివరికి కమిటీని ఏర్పాటు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు వన్నెం రెడ్డి శ్రీను, కోటిపల్లి సురేష్, పాలూరు బాబ్జి, గంగరాజు, వైకెఎస్‌లు డిమాండ్ చేశారు. ఆ తరువాత బాక్స్ టెండర్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతుందని, గత ఐదు నెలల్లో ఎన్ని లక్షల పనులు బాక్స్ టెండర్ల ద్వారా చేపట్టారో తెలియజేయాలని పట్టు పట్టారు. అనంతరం పలువురు సభ్యులు పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

భూముల విలువ పెంచేందుకు చర్యలు..!

ప్రజాశక్తి - ఆచంట

ఒక పక్క ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసర సరుకుల ధరలు, పెరిగిన విద్యుత్ భారాలతో సతమతమవుతున్న ప్రజలపై ప్రభుత్వం మరో బాదుడుకు రంగం సిద్ధం చేసింది. భూముల మార్కెట్ విలువ అమాంతంగా పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఈనెల 1 నుంచి పెంచిన భూముల విలువను అమలు చేయాలని భావించినా.. కొన్ని అనివార్య కారణాల వల్ల దానిని ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్నది. ఈ తరహా రిజిస్ట్రేషన్‌లో రెవెన్యూ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేయడంతో వారు ఆ దిశగా చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో నాలుగు సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలోని భూముల ఇల్లు, ఇతర ఆస్తుల విలువలు అమాంతంగా పెంచేందుకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ అధికారులు సన్నద్ధమయ్యారు.

1 నుంచి రిజిస్ట్రేషన్ విలువ పెంపు

ప్రజలపై మరో కొత్త బాదుడు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భూముల మార్కెట్ విలువ అమాంతంగా పెంచేందుకు చర్యలు చేపట్టింది. నూతన సంవత్సరం ఆరంభం నుంచి పెంచిన భూముల విలువను అమలు చేయాలని భావించినా కొన్ని కారణాల వల్ల దానిని ఫిబ్రవరి 1 నుంచి అమలు చేయనున్నారు. ఈమేరకు రిజిస్ట్రేషన్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేయడంతో వారు ఆ దిశగా చర్యలు చేపట్టారు. నియోజవర్గంలో నాలుగు సబ్ రిజిస్టర్ కార్యాలయాల పరిధిలోని భూముల ఇల్లు, ఇతర ఆస్తుల విలువలు అమాంతంగా పెంచేందుకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే భూముల విలువ ఎక్కువగా ఉందనుకునే ఏరియాలో 15 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని, భూమల విలువ తక్కువగా ఉందనుకునే ఏరియాలో 45 శాతం వరకు పెంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ మెరుపు పెంపుపై రిజిస్ట్రేషన్‌లో రెవెన్యూ అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఎక్కడ ఏ విధంగా భూముల విలువను పెంచాలనే దానిపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. కొత్త నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని భూముల విలువను అమాంతంగా 45 శాతానికి వరకు పెంచుతున్నారు. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామపంచాయతీల వారిగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాల విలువను పెంచనున్నారు. పట్టణాలు, అపార్ట్మెంట్‌లోని ప్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగుల విలువలు 900 నుంచి 1400 వరకు పెరగనున్నది. ప్రాంతాలవారీగా స్థలం విలువలను బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతూ ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెంచిన మార్కెట్ విలువలు నూతన సంవత్సరం కానుకగా ప్రజలపై భారం వేయనున్నాయి. పెంచిన విలువలను ఈనెల 20వ తేదీ లోపు రిజిస్టర్లు డేటా ఎంట్రీ చేశారు. వీటిపై 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటేనే స్వీకరించారు. ఫిబ్రవరి 1 నుంచి పెంచిన విలువల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదాయం కోసం మార్కెట్ విలువను పెంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆచంట నియోజకవర్గంలో గజం భూమి విలువ సుమారు రూ.45 వేల వరకు ఉంది. ప్రస్తుతం అక్కడ 15 శాతం పెంచుతారు. రూ.6,750 వరకు రిజిస్ట్రేషన్ విలువ పెరుగుతుంది. భూమి విలువ గజానికి రూ.52,750 కు చేరుతుంది. ఆచంట కచేరి సెంటర్, పెనుగొండ టౌన్, పెనుమంట్ర టౌన్, పోడూరు మండల కేంద్రంలో ప్రస్తుతం గజం విలువ రూ.25 వేల వరకు ఉంది. 10 నుంచి 20 శాతం పెంచితే గజానికి రూ.5 వేల వరకు పెరుగుతుంది. గజం భూమి విలువ రూ.30 వేలకు చేరుకుంది. ఇలా అన్ని ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంచనున్నారు. విక్రయాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో భూమి స్థలాల విలువలు తప్పనిసరిగా పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రజలపై మరో బాదుడుకు రంగం సిద్ధం

సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద బిజీ బిజీగా ప్రజలు

పెంచడం సరికాదు

బొక్క లీలా సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి, ఆచంట

గత ప్రభుత్వంలో మూడు, నాలుగు సార్లు పెంచింది. దీంతో రిజిస్ట్రేషన్ విలువలు పెరిగిపోయాయి. ప్రజలు భూములను కొనుగోలు చేయడానికి భయపడుతున్నారు. కొనుగోలు శక్తి కన్నా అధికంగా విలువలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం సులభంగా ఆదాయం పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంది. రిజిస్ట్రేషన్ విలువల పెంపు ప్లాట్లు, స్థలాల అమ్మకాలపై ప్రభావం చూపుతుంది. ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అవకాశం ఉంటే రిజిస్ట్రేషన్ విలువను తగ్గించాలి తప్ప పెంచడం సరికాదు.

రెవెన్యూ గ్రామ సదస్సుల్లో అర్జీలు పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - పాలకోడేరు

రెవెన్యూ గ్రామ సదస్సులలో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలిచారు. రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామ సదస్సులు పిజిఆర్ఎస్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. రీ సర్వేలు, గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులు విస్తీర్ణలలో హెచ్చుతగ్గులు క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ రికార్డులు అన్నీ సంబంధిత కార్యాలయాలకు పంపించాలని ఆదేశించారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రీ సర్వే చేసే ముందు సంబంధిత భూ యజమానులకు కచ్చితంగా నోటీసులు అందజేసి, వారి సమక్షంలో సర్వే చేయాలన్నారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే ముందుగా తెలుసుకుని సర్వే నిర్వహించాలన్నారు. విఆర్ఒలు, రెవెన్యూ సర్వే సిబ్బంది, భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జెసి వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా సర్వే ఇన్‌ఛార్జి అధికారి కె.శ్రీనివాస్, తహశీల్దార్, నడింపల్లి భారతి విజయలక్ష్మి, మండల సర్వేయర్ సిహెచ్.శ్రీనివాస్, డిటిలు, విఆర్ఒలు ఉన్నారు.

చెక్కు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

లయన్స్ సేవలు అభినందనీయం

లయన్స్ మాజీ గవర్నర్ సత్యనారాయణ

ప్రజాశక్తి - గణపవరం

పేదప్రజలకి సేవా కార్యాక్రమాలు అందచేయటంలో లయన్స్ క్లబ్ ముందుభాగాన ఉటుందని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక కృష్ణాజి ఫామ్ హౌస్‌లో జరిగిన లయన్స్ క్లబ్ జోన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి జోన్ చైర్‌పర్సన్ పోశింశెట్టి రామూర్తి అధ్యక్షత వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలో 200 దేశాలలో లయన్స్ తన సేవలను ప్రజలకి అందిస్తుందని చెప్పారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆన్‌లైన్ బోధనచేయడానికి వీలుగా జల్లికొమ్మర యుపి పాఠశాలకు రూ.30 వేల విలువ గల టివి కొనుగోలు నిమిత్తం చెక్కును జోనల్ సమావేశంలో పాఠశాల సిబ్బందికి అందజేశారు. నూతనంగా ఎన్నికైన జోనల్ చైర్‌పర్సన్ పోశింశెట్టి రామూర్తి మాట్లాడుతూ తన పరిధిలోగల గణపవరం, ఉండి, ఉంగుటూరు జుత్తిగా లయన్స్ క్లబ్‌లో లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

నరసాపురంలో ఉచిత మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్య అధికారులు

పశువైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని చామకూరి పాలెం రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం పశు ఆరోగ్య శిబిరం, లేగ దూడ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి బొక్కా రామస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వై.సుధాకర్, పశు వైద్యాధికారి ఐ.సురేంద్ర కుమార్ లేగ దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. లేగదూడల ప్రదర్శనలో మొదటి బహుమతి గుత్తుల వెంకటేశ్వరరావు, రెండో బహుమతి మల్లుల బ్రహ్మాజీ రావు, మూడవ బహుమతి కొల్లాటి వెంకటేశ్వరరావు గెలుచుకున్నారు. వైద్య శిబిరంలో వైద్యులు జి.నీలిమ, మొర్య 326 గొర్రెలు, మేకలకు, 64 లేగ దూడలకు, 85 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వి.పుష్పా, నారా కృష్ణంసాయి, కార్యదర్శి చిక్కాల వర ప్రసాద్, సిహెచ్.చందు కుమార్, పి.నరేష్, సిహెచ్.సుధీర్, నాయకులు గుబ్బల హరిచంద్ర, వంశీ పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి పర్వాల సూర్యనారాయణ సూచించారు. మండలంలోని కోమటితిప్పలో ఏర్పాటుచేసిన పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు విధిగా నట్టల నివారణా మందు వేయాలని సూచించారు. వైద్యురాలు జి.నీలిమ పలు పశువులను పరీక్షించి మందులను అందజేశారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు ఉన్నారు.

పేకాట క్లబ్ మూసివేయాలి

జనసేన గ్రామ కమిటీ సభ్యులు

వినతిని అందజేస్తున్న జనసేన సభ్యులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురం సౌత్ గ్రామంలో కల్చరల్ యూత్ క్లబ్ పేరిట నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌ను మూసివేయాలని జనసేన గ్రామ కమిటీ సభ్యులు పంచాయతీ కార్యదర్శి మండెల యుగంధర్ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని పెట్రోల్ బంక్ పక్కన కల్చరల్ యూత్ క్లబ్ పేరిట పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారన్నారు. దీని వల్ల గ్రామంలోని యువతతో పాటు చుట్టు పక్కల నుంచి అనేక కుటుంబాలు పేకాటకు బానిసై ఆర్థికంగా చితికిపోయే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు గ్రామంలో నిర్వహించడం వల్ల గ్రామ ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. సంబంధించిన అధికారులు గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌ను మూసివేయాల్సిందిగా జనసేన గ్రామ కమిటీ సభ్యులుగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాస్కురి బద్రి, మారుబోయిన శ్రీను, రావి వెంకట రత్నం, కూనపరెడ్డి యేసు, యాదవరెడ్డి సత్యనారాయణ, పెనుగొండ శ్రీను, కైలామణి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ అధికారులకు సత్కారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిబద్ధతతో పనిచేస్తే ఏ అధికారికైనా, ప్రజాప్రతినిధికైనా అవార్డులు వాటంతట అవే వస్తాయని పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయస్థాయిలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానం పొందిన పెద్ద తాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం, జిల్లా ఉత్తమ ఎంపిడిఒగా అవార్డు పొందిన ఎం.విశ్వనాథశర్మ, ఉత్తమ ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్, ఉత్తమ కార్యదర్శి టి.రవి చందులను బుధవారం కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విశ్వనాథ్ మాట్లాడుతూ తనకు ఉత్తమ ఎంపిడిఒగా అవార్డు రావడం మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శుల సహకారం వల్లే సాధ్యమైందన్నారు. ఇఒపిఆర్‌డి వెంకటేష్ మాట్లాడుతూ కార్యదర్శులు రెడ్‌క్రాస్ సొసైటీకి సేవాగుణంతో అత్యధికంగా చందాలు ఇవ్వడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఉత్తమ కార్యదర్శి టి.రవిచంద్ర మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కార్యదర్శి కీలకమని, అలాంటి కార్యదర్శులను గుర్తించి అవార్డు లభించడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.శేషులత, కార్యదర్శుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి వీరబ్రహ్మం, ఆర్‌డబ్ల్యు ఎఇ రాజా శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎఇ ఎం.శ్రీనివాస్ కుమార్, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం.రవి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవార్డు పొందిన వారిని సత్కరిస్తున్న అధికారులు

రు.3.59 కోట్లతో మరో విద్యుత్ లైన్ ఏర్పాటు

వీరవాసరం : వీరవాసరం మండలానికి రూ.3.59 కోట్లతో మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నట్టు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ తెలిపారు. ఈమేరకు బుధవారం కూటమి నాయకులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. భీమవరం ఎంఎల్ఎ అంజిబాబు కృషి వల్లే మండలానికి విద్యుత్ సమస్యలను అధిగమించనున్నట్టు ఎంపిపి తెలిపారు. ప్రస్తుతం భీమవరం నుంచి వీరవాసరం మండలానికి ఒక లైన్ ద్వారా మాత్రమే సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ లైన్‌లో అంతరాయం ఏర్పడితే ప్రత్నామయ లైను లేకపోవడంతో మండలానికి వచ్చే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గత కొన్ని సంవత్సరాలుగా మండల ప్రజలు ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. తాజాగా మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం వల్ల ఒక లైనులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే మరో లైన్ ద్వారా తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించవచ్చు. ప్రస్తుతం విస్సాకోడేరు వద్ద గల 133 కేవీ లైను నుంచి వేండ్ర, అండలూరు మీదుగా కొణితివాడ సబ్ స్టేషన్ వరకు 16.6 కి.మీ కొత్త లైను ఏర్పాటు చేసి అనుసందానం చేయనున్నారు. అక్కడ నుంచి వీరవాసరం సబ్ స్టేషన్‌కు అనుసందానం చేసిన విద్యుత్ సరఫరా అంతరాయాన్ని అధిగమించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డాల రాము, ఎంపిటిసిలు అంగర కుటుంబరావు, వీరవల్లి ఉషారాణి, బోను జోత్స్నదేవి, పెంటకోటి సైదేశ్వరావు, సర్పంచులు వేండ్ర లీలాకృష్ణ, బోనం పరమేశ్వరావులు పాల్గొన్నారు.

15న టెక్ ఫ్లీట్

భీమవరం టౌన్ : జాతీయస్థాయిలో ఫిబ్రవరి 15వ తేదీన సిఎస్ఐ స్టూడెంట్ ఛాప్టర్ ఆధ్వర్యంలో ఐటి విభాగం టెక్ ఫ్లీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణనిశాంత్ వర్మ బుధవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ఐటీ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ పి.రవి కిరణ్ వర్మ మాట్లాడుతూ టెక్ ఫ్లీట్ కార్యక్రమాల్లో భాగంగా ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు దేవాప్స్ వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన బ్రెయినో విజన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహణ జరుగుతుందన్నారు. మొదటి రెండు రోజులు వర్క్‌షాప్, మిగిలిన రెండు రోజులు హేకథాన్ నిర్వహించి అందులో విజేతలైన వారికి రూ.30 వేల నగదు బహుమతి కూడా అందించనున్నట్లు వివరించారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, క్రీడా స్ఫూర్తి కలిగించే విధంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు స్పోర్ట్స్ ఫెస్ట్ కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అడ్వైజర్‌గా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.హేమలత, డాక్టర్ కె.కిషోర్ రాజు వ్యవహరిస్తున్నారు. కోఆర్డినేటర్లుగా ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్‌విఎస్ఎస్.లక్ష్మి, ఎం.రాధ, స్టూడెంట్ కోఆర్డినేటర్లుగా ఎం.విజయ్, టి.సుధీర్, ఎంఎస్ కె.శరణ్య, ఎ.అక్షర, లోకేష్, గోకుల్‌తో పాటు సిఎస్ఐ బాడీ మెంబర్స్ కూడా కోఆర్డినేట్ చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల సెక్రటరీ

మాధవరంలో పొలాల పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రస్తుతం మండలంలో పురుగులు, తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉందని, మాధవరంలో రైతులు ముందస్తుగా పురుగుమందులను పిచికారీ చేసుకోవద్దని, పురుగు తాలూకా లక్షణాలు ఉంటేనే పురుగుమందులు పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. అక్కడక్కడ సల్ఫైడ్ ఇంజురీ కనపడుతుందని, సల్ఫైడ్ ఇంజురీ కనిపించే వరిచేలలో 20:20:0:13 అనే ఎరువులు వాడొద్దని తెలిపారు. చేలు ఆరబెట్టాలని, కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎసిఫేట్ 1.5 గ్రామ్స్ ఒక లీటర్ నీటికి లేదా క్లోరాంట్ర నిలిప్రోలు 0.3 ఎంఎల్ 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకు ముడత ఉధృతి ఉంటే మనోక్రోటఫాస్ లేదా అసెఫేట్ పిచికారీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జి వి.సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నుంచి వంతుల వారీ విధానం అమలు

ప్రజాశక్తి - భీమవరం

గోదావరి నదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో గోదావరి పశ్చిమ డెల్టా 11 ప్రధాన కాలువలకు వంతుల వారి విధానం(టర్న్ సిస్టం) ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు నరసాపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ ఉప కార్య నిర్వాహక ఇంజనీరు సిహెచ్.వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వంతుల వారి విధానం రెండువంతులుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొదటి వంతు ఆరు రోజులు, రెండో వంతు మరో ఆరు రోజులుగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థులు చట్టపరమైన అంశాలపై దృష్టి సారించాలి

10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ

ప్రజాశక్తి - నరసాపురం

న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వైఎన్ కళాశాలలో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహం అనే సబ్జెక్ట్‌లపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం విజేతలకు నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ స్థానిక కోర్ట్ ప్రాగణంలో విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విజయదుర్గ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు చట్టపరమైన అంశాలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఉన్నత న్యాయ స్థానాలు ఇలాంటి చట్టాలపై అవగాహన పొందేందుకు, వ్యాసరచన, డిబెట్, షార్ట్ ఫిల్మ్స్, రీల్స్ మొదలగు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజలలో అవగాహన కల్పించడానికి ఇదొకమార్గం అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ, కార్యదర్శి ఆర్.పుల్లాజీ, వైఎన్‌బి ఇడి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శాంతి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సాధారణ బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - ఆకివీడు

ఈనెల 30వ తేదీ గురువారం నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం జరుగుతుందని కమిషనర్ ఎం.కృష్ణమోహన్ తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందని, అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు బడ్జెట్ సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేసి, విజయ పతాకాన్ని ఎగరవేయాలని మాజీ మంత్రి, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పెనుమంట్ర మండలం మార్టేరు శ్రీవేణుగోపాలస్వామి ఆడిటోరియంలో ఎంఎల్‌సి ఎన్నికల అవగాహనా సదస్సు జనసేన, బిజెపి, టిడిపి నాయకులకు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడు, ఉత్తరాంధ్ర ఎంఎల్‌సి వేపాడ చిరంజీవిరావు, నరసాపురం పార్లమెంటు టిడిపి అధ్యక్షులు, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడారు. ఆచంట నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కెహెచ్‌వి.ప్రసాద్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, ఆచంట ఎంపిపి సూర్యకుమారి, వాటర్ డిస్ట్రిబ్యూటరీ సంఘం చైర్మన్‌లు వెలగల బుల్లి రామిరెడ్డి, రామకృష్ణ ప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, చిగురుకోట గ్రామ కాపురస్తుడు ముచ్చు వెంకన్న గారి కుమారుడు ముచ్చు నాగేశ్వరరావుకు చెందిన ముదినేపల్లి మండలం, చిగురుకోట గ్రామంలోని ఆర్.ఎస్. నెం. 182 గల చ.గ. 169.04లు గల నివేశన స్థలమును కైకలూరు రీ సర్వే నెం.లో ద.నెం. 1435/2019రుగా రిజిష్టర్డు దస్తావేజును నేను చిగురుకోట నుండి ముదినేపల్లి గ్రామంలో గల మెయిన్ సెంటర్ నందు వెహికల్‌పై వస్తుండగా జిరాక్స్ నిమిత్తం వెళ్ళగా నా యొక్క దస్తావేజు నెం. 1435/2019రు ఒరిజినల్ మార్గమధ్యలో జారిపడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల తెలియజేయగలరు.

ఇట్లు
టి.శ్రీనివాసులు,
అడ్వకేట్, నోటరీ,
కోర్టుబిల్డింగ్స్ ఎదురు, గుడివాడ.
సెల్ : 9394211742.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT NUZIVID
EP No. 60/2016 in. ABR/CF/No. 172/2014

Margadarsi Chit Fund (P) Ltd., Santhosh Nagar Branch, Hyderabad ....D.H.R.

AND

Mr. T.V.R Vara Prasad, S/o Krishna Rao, aged / 56 years, R/o H. No. 1-8-22/1, Flat No: G-2, Sarathi Apartments, North Kamala Nagar, ECIL(P), R.R. Dist. (Property situated at Nuzivid, Eluru dist) ..... 1st J.D.R

పై నెంబరు అమలులో 1వ జెడిఆర్ తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 17-02-2025వ తేదీన కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు బహిరంగ వేలము జరుగునని తెలియపరచటమైనది. కావున వేలంపాటలో పాల్గొను వారు వేలంపాటలో పాల్గొనవచ్చును.

1st JDR Schedule : Krishna District, Nuzivid Sub Register Office వారి యిలాకా Nuzivid Municipality ఏరియాలోని, Nuzivid Mandal, Nuzívíd Villages Agriculture Land Admeasuring Ac 0-23, 3/4 Cts Or 0.97 Hectors in Survey No. 1005/1, Nuzivid ఏరియాలో 'గల ఖాళీగా వున్న స్థలమునకు హద్దులు ::
North : Badugu Rambabu & E. Rajashekar Land.
South : Donka, West : donkas
East: Guttikonda Hari Krishna Prasad Land.
Note : Krishna district, Now present Eluru District). .
D.H.R. Value : Rs. 4,00,000/-
Ameen Value Rs. 7,00,000/-
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం).
వేలం వాయిదా : 17-02-2025.
ఫరదర్ హియరింగ్ : 24-02-2025

ఇట్లు
ఎం. రమేష్,
అడ్వకేట్, నూజివీడు.